


- ఐదేండ్లలోనే దూరమైన కరువు
- ఎత్తుప్రాంతాలకు తీరిన సాగునీటి గోస
- వనపర్తి నియోజకవర్గంలో 77 మినీ లిఫ్టులు..
- రాష్ట్రంలోనే ప్రథమంగా ఏర్పాటు
- రెండు పంటలతో సంబురంగా సాగు
- గత ప్రభుత్వ చొరవపై రైతన్న హర్షం

# సాగుకు లిఫ్ట్

## ఏడు మండలాలు.. 77 మినీలిఫ్టులు

వనపర్తి, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఒకటి కాదు.. రెండు కాదు.. వనపర్తి నియోజకవర్గంలో ఏకంగా 77 మినీ లిఫ్టులను ఏర్పాటు చేయించి వాటి ద్వారా సాగునీరు పారించి తొమ్మిదిన్నరేండ్లలో పసిడి పంటలు పండించేలా కృషి చేశారు. ఇంతలా మినీ లిఫ్టుల వ్యవస్థతో వేలాది ఎకరాలను సాగులోకి తెచ్చిన ఘనత రాష్ట్రంలో ఒక్క వనపర్తికే దక్కుతుంది. ఈ మినీ లిఫ్టుల ఏర్పాటు జరిగిన ప్రాంతమంతా అధికంగా గిరిజన తండాలు, గ్రామాలు ఉండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చొరవతో మినీ లిఫ్టులు ఏర్పాటయ్యాయి. వనపర్తి నియోజకవర్గంలో ఏడు మండలాలున్నాయి. వీటిలో చాలా వరకు సాగునీటి వనరులు అందుబాటులోకి వచ్చిన ప్రాంతాలున్నాయి. ఎంజీకేఎల్ఐతోపాటు భీమా-2 ద్వారా వనపర్తి మండలంతోపాటు పెద్దమందడి, గోపాల్‌పేట, ఖిల్లాఘణపురం, రేవల్లి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాలకు సాగునీరందుతుంది. అయితే ప్రధాన కాల్వల ద్వారా వీటికి సాగునీరందుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లోని భూములు ఎత్తుపల్లాలుగా ఉండటంతో అక్కడి పొలాలకు సాగునీరందని పరిస్థితి ఉండింది. ఆయా ప్రాంతాలకు మాజీ మంత్రి సింగిరెడ్డి వెళ్లినప్పుడు ఆ ప్రాంత రైతులు తమ పొలాలకు నీళ్లు కావాలని అడగటంతో ప్రత్యేక మినీ లిఫ్టులకు శ్రీకారం చుట్టారు. ఒక్కటితో మొదలైన ఈ ప్రక్రియ క్రమంగా నియోజకవర్గమంతా వ్యాపించి ఎత్తుపల్లాల భూముల్లోనూ పచ్చని పసిడి పంటలకు తార్కాణమైంది.

**77 మినీ లిఫ్టులు..**

నియోజకవర్గంలోని 7 మండలాల్లో 77 మినీ లిఫ్టులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. వీటిలో ఒక్క పెద్దమందడి మండలంలోనే 26మినీ లిఫ్టులను ఏర్పాటు చేయగా, వనపర్తి మండలంలో 14, గోపాల్‌పేటలో 8, రేవల్లిలో 13, ఖిల్లాఘణపురంలో 5, శ్రీరంగాపురం మండలంలో ఒక మినీలిఫ్టు ఏర్పాటు చేశారు. పాన్‌గల్ మండలంలోనూ మరో 10వరకు మినీ లిఫ్టులను మంత్రి ఏర్పాటు చేయించి, వనపర్తి పరిధిలోని గుట్టల మధ్య ఉన్న కాశీంనగర్‌వంటి ప్రాంతాలకు సాగునీరందించారు. ఈ మినీలిఫ్టులతో ఎత్తు పల్లాల భూములకు సాగునీరందించడం ద్వారా రైతులు పుష్కలంగా పంటలు పండిస్తున్నారు. వీటి ఆధారంగానే దాదాపు 10 వేల ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు పండిస్తున్నారు. ఇదంతా ఈ ఐదేండ్లలోనే జరిగింది. గతంలో వేసిన బోర్లు, పంట చేతికి రాకముందే ఎండిపోవడంలాంటి పరిస్థితుల్లో కొత్త బోరు వేయాల్సిన అవసరమే లేకుండా పోయింది.



వనపర్తి మండలం కడుకుంట్లలో ఏర్పాటు చేసిన మినీలిఫ్ట్

**మున్ననూరులో 4 మినీలిఫ్టులు..**

గోపాల్‌పేట మండలం మున్ననూరులో చినపోలిగుట్ట, ఊరగుట్ట, దేవునిగుట్ట, అడ్డవేటుగుట్ట ప్రాంతాలకు నాలుగు మినీ లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఎంజీకేఎల్ఐలోని డీ-8 కెనాల్‌పై మేజర్ 3-ఏ కాల్వ ద్వారా ఒక్కొక్క లిఫ్ట్‌లో రెండు మోటర్లు చొప్పున (15 హెచ్‌పీ)ఏర్పాటు చేసి నీరందించారు. ఇందుకు అవసరమైన విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసి నిరాటంకంగా ఐదేండ్లుగా పంటలకు నీరిస్తున్నారు. మున్ననూరులో 2వేల ఎకరాల భూములుంటే, వీటిలో సగం పొలాలు ఎత్తుపల్లాలు, గుట్టలను అనుసరించే ఉంటాయి. ఈ మినీ లిఫ్టులు ఏర్పాటు చేయడం వల్ల 80శాతానికి పైగా భూములకు సాగునీరందుతున్నది. ఎటు చూసినా వరికోతలు ముగియగా, ప్రస్తుతం వేరుశనగ పంటలు కనిపిస్తున్నాయి. ఈ నాలుగేండ్లలో గ్రామంలోని ఇద్దరు రైతులు పండించిన పంటలను లెక్కకడితే రూ.48లక్షల లెక్కకు వస్తుంది. గడచిన 50ఏండ్లను పరిశీలిస్తే ఇది ఊహించని మార్పు. గతంలో ఎంత నష్టపోయామో ఆలోచిస్తే అర్థమవుతుంది. నేడు మున్ననూరులోని ఏ గుట్ట ప్రాంతం చూసినా నీళ్ల తొక్కిసలాట ఉంది. పచ్చని పైర్లు కనిపిస్తాయి. ఇందుకు మున్ననూరు ఒక ఉదాహరణ మాత్రమే. ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎత్తుప్రాంతాలకు మినీ లిఫ్టులను ఏర్పాటు చేశారు.

**చినపోలిగుట్ట కోటయ్యకుంటలో..**

మున్ననూరులోని చినపోలిగుట్ట పొలాలను అనుసరించి కోటయ్య కుంట ఉంది. ఈ కుంటకు మేజర్ 3-ఏ కెనాల్ ద్వారా రెండు మోటర్లు ఏర్పాటు చేసి మినీ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కుంట ప్రస్తుతం నీటితో నిండి ఉంది. మోటర్లు కూడా నడుస్తున్నాయి. వరికోతలు ముగియగా, వేరుశనగ మరో 25రోజులైతే చేతికి వస్తుంది. ఈ మినీలిఫ్ట్ ద్వారా ఒక్క కోటయ్యకుంట కిందనే దాదాపు 100 ఎకరాలు సాగవుతున్నది. ఈ ఒక్క కుంటలోనే సుమారు 20 మంది వరకు రైతులు మోటర్లు ఏర్పాటు చేసుకొని గుట్టపైకి నీటిని తరలిస్తున్నారు. నాడు ఏడారిని తలపించిన ప్రాంతం నేడు పచ్చని పంటలతో కళకళలాడుతున్నది.





### రాష్ట్రంలోనే ప్రథమం..

ఒక్క నియోజకవర్గంలో ఇలా ఇన్ని మినీలిఫ్టులను ఏర్పాటు చేయడం దాదాపు రాష్ట్రంలోనే ప్రథమంగా చెప్పవచ్చు. రైతులు నీరు కావాలని అడిగిన తక్షణమే మినీలిఫ్టులు ఏర్పాటు చేయించి సాగునీరందేలా మాజీ మంత్రి సింగిరెడ్డి చొరవ తీసుకున్నారు. ఈ మినీలిఫ్టులను ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, సీఎస్ఆర్ నిధుల ద్వారా ఏర్పాటు చేయించారు. ఇదిలా ఉండగా, తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలో మొత్తం పంటల విస్తీర్ణం, వరిపంట, నీటిపారుదల విస్తీర్ణం గణనీయమైన ప్రగతిని సాధించింది. 2014-15లో రెండు సీజన్లు కలిపి లక్షా 39,244 ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉండగా, నేడు రెండు సీజన్లు కలిపి 2లక్షల 22,650 ఎకరాలకు పెరిగింది. ఈ మేరకు 59.89 శాతం వృద్ధి చెందింది. అలాగే అప్పట్లో వరి పంట విస్తీర్ణం రెండు సీజన్లలో 38,215 ఎకరాలుంటే, ప్రస్తుతం లక్షా 72,582 ఎకరాలకు చేరి, 351.60 శాతం వృద్ధి రేటును సాధించింది. అదేవిధంగా నీటిపారుదల రంగంలోనూ 2014లో 71,292 ఎకరాల నుంచి 1,72,582 ఎకరాలకు పెరిగి, 142.07 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. వీటన్నింటి మూలంగా నేడు పసిడి పంటల వనపర్తిగా పేరు తెచ్చుకున్నది.

### పుష్కలంగా నీళ్లొస్తున్నయ్..



నాలుగేండ్లుగా పుష్కలంగా నీళ్లొస్తున్నాయి. అంతకుమునుపు బోర్లు వేసి అప్పుల్లో పడ్డాం. ఇప్పుడు ఆ బాధ తప్పింది. మా గుట్టల పొలాలకు చిన్న లిఫ్టులు పెట్టి నీళ్లు ఇచ్చిండ్రు. ఇప్పుడు నీళ్లు పుష్కలంగా వస్తున్నయి. బోర్లతో పనిలేదు. పనిలేక పట్నం పోయేటోళ్లం. ఇప్పుడు మా బతుకులు మారినయి. బోర్లు ఎండటం, లోవోల్టేజీతో మోటర్లు కాలడం ఆ బాధలు తలుచుకుంటే గుండె గుబేల్ మంటది. ఇప్పుడు ఎక్కడ చూసినా పంటలే కనిపిస్తున్నయి.

**- బాలరాజు, రైతు, మున్ననూరు, గోపాల్‌పేట**

### గంగమ్మ రాకతో సంబురం..



మా కోటయ్యకుంటకు గంగమ్మ వొచ్చినంక మా బతుకులు మారినయి. ఐదేండ్లకు ముందు ఒక్క చుక్క నీరులేదు. అర ఎకరం నాటినా సగం ఎండేది. రాత్రి, పగలు కష్టపడేటోళ్లం. ఇప్పుడు చాలా మేలైంది. చిన్న లిఫ్టులు వచ్చినంక నీళ్లు వచ్చినయ్. పంటలు బాగా పండుతున్నయ్. ఇంతకుముందు వలస పోతుంటిమి. ఇప్పుడు రెండు పంటలు పండిస్తున్నం. వరి పంట కోసినం. వేరుశనగ పంట రావాలి. నీళ్లు లేక ఎంత గోసపడ్డమో ఆ బాధలు చెప్పలేం. మా గుట్టపొలాలకు ఇట్ల నీళ్లు వస్తాయని అనుకోలే.

**- నరసింహా, రైతు, మున్ననూరు, గోపాల్‌పేట మండలం**

### రెండు పంటలు పండిస్తున్నాం..



ఎత్తు ప్రాంత రైతుల పొలాలకు నీళ్లు అందించేందుకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పెద్దమందడి పెద్ద చెరువు నుంచి నాలుగు లైన్లు పైప్‌లైన్ వేసి 20 హెచ్‌పీ మోటర్ ద్వారా మినీ లిఫ్ట్ ఏర్పాటు చేసి దాదాపు 150 ఎకరాలు సాగులోకి వచ్చేలా చేశారు. నాకు పది ఎకరాల పొలం ఉంది. ఏడెకరాల్లో వరిసాగు చేశాను. 175 క్వింటాళ్ల పంట పండింది. ప్రస్తుతం మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఇంకో నెల రోజుల్లో వేరుశనగ పంట కూడా చేతికొస్తుంది. నిరంజన్‌రెడ్డి సారు వల్లనే నీళ్లొచ్చి మా పొలాలు పండి సంతోషంగా సాగు చేసుకుంటున్నాం.

**- పురుషోత్తంరెడ్డి, రైతు, పెద్దమందడి**

### నీళ్ల గోస తీరింది..



మున్ననూరుకు సాగునీటి గోస తీరింది. ఎంజీకేఎల్ఐ కాల్వలు వచ్చినా అన్ని పొలాలకు నీరు రాలేదు. మా ఊరు గుట్టల ప్రాంతంగా ఉంది. ఎటుచూసినా ఎత్తైన గుట్టలే. మాజీ మంత్రి సింగిరెడ్డి చొరవతో నాలుగు మినీ లిఫ్టులు ఏర్పాటు చేశాం. ప్రతి రైతు పంటలు పండిస్తున్నాడు. కరెంట్, నీళ్ల సమస్య లేదు. ధాన్యం విక్రయ సమస్య లేదు. ఇలా రైతుకు అవసరమైన అన్నిరంగాల్లో వసతులు మెరుగయ్యాయి. ఇంతలా ఎవరూ రైతుల కోసం పనిచేయలేదు.

**- తిరుపతయ్య యాదవ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు ,గోపాల్‌పేట**

# వరినారు.. సస్యరక్షణ చర్యలు

- యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- వరినారులో జాగ్రత్తలు పాటించాలి
- అన్నదాతలకు అధికారుల సూచనలు

గద్వాల, డిసెంబర్ 7 : రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతుండడంతో వరినారు ఎదగక పంటకు తెగుళ్లు సోకే అవకాశముంటుంది. కానీ, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంట పొందవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గత వర్షాకాల పంటలకంటే యాసంగిలో రైతులు వరిపంటను అధికంగా సాగు చేసే అవకాశమున్నందున వరి పంటలను సాగుచేసే రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన రసీదును భద్రపర్చుకోవాలి. విత్తనాలు మొలకెత్తే సమయంలో సమస్యలు వస్తే దుకాణదారుపై చర్యలు తీసుకోచ్చు.

***నారుమడిలో రక్షణ చర్యలు..***

- నారు పోసిన నాలుగైదు రోజులు తరువాత నారుమడిలో కిలో యూరియా, 2కిలోల డీఏపీ, కిలో పొటాష్‌ను చల్లాలి. చలి తీవ్రతతో నారుమడి ఎరుపు రంగులోకి మారి చనిపోతుంది. దీని నివారణకు 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఆకుపచ్చ తెగుళ్లు కనిపిస్తే కార్బండిజం 1.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మళ్లీ నాలుగైదు రోజుల వ్యవధిలో నారుమడి ఎరుపు రంగులోనే ఉంటే ఫార్ములా-4, ఫార్ములా-5ను రెండుసార్లు పిచికారీ చేయాలి. దీంతో సూక్ష్మదాతు లోపాన్ని నివారించవచ్చు.
- గడిచిన వానకాలం సీజన్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి వరిపై కాండం తొలుచు పురుగు ప్రభావం ఉంటుంది. కాబట్టి నారుమడి వేసిన 15 రోజులకోసారి కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లాలి. రెండో విడుతగా నాటువేసే వారం రోజుల ముందు మరోసారి చల్లాలి.

***రసాయనాలతో విత్తన శుద్ధి..***

- తడి పద్ధతి విధానంలో లీటర్ నీటికి 1.5 గ్రాముల కార్బండిజం పొడిని కలిపి 30 కేజీలకు సరిపడే ద్రావణాన్ని తయారుచేయాలి. ఈ ద్రావణంలో 12 నుంచి 24 గంటల వరకు విత్తనాలను నానబెట్టాలి.
- పొడి విధానంలో 3 గ్రాముల కార్బండిజం పొడిని కిలో విత్తనానికి బాగా పట్టించాలి.

***సేంద్రియ పద్ధతిలో విత్తన శుద్ధి..***

- ఐదు గ్రాముల సూడోమోనాస్ పొడిని కిలో విత్తనానికి ఒక లీటర్ నీటిచొప్పున కలుపుతూ 30 కిలోల విత్తనానికి సరిపడే ద్రావణాన్ని తయారు చేయాలి. ఈ ద్రావణంలో విత్తనాలను 12 నుంచి 24 గంటలపాటు నానబెట్టాలి.
- ఒకవేళ కొత్త విత్తనాలు వేయదలిస్తే మొలకశాతం పెరగడానికి నత్రికామ్లం 30 మిల్లీ లీటర్లను 50 లీటర్ల నీటిలో కలిపి 12 గంటలు నానబెట్టాలి.
- ఈ సీజన్‌లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. కాబట్టి మామూలు విధానం కంటే పొలంలో 10 సెంటిమీటర్ల ఎత్తులో బెడ్డును ఏర్పాటు చేసి నారు పోయాలి. దీంతో చలి నుంచి కొంత మేర రక్షించవచ్చు.

***నాటువేసే సమయంలో..***

- 25 నుంచి 30రోజుల నారును మాత్రమే నాటుకోవాలి.
- నాటువేసే సమయంలో నారు చివరి ఆకులను తుంచి నాటితే మంచిది.
- నాటువేసే ముందు క్లోరోపైరిపాస్ 2.5మి.లీ మందును లీటర్ నీటికి కలిపి 50లీటర్ల ద్రావణాన్ని తయారు చేయాలి. ఈ ద్రావణంలో నారును నానబెట్టి నాటితే రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు.

***చలినుంచి కాపాడేందుకు..***

- రాత్రి వేళల్లో నారుమడిలో నీటిని తీసి వేసి ఉదయాన్నే వెచ్చని బోరునీటిని పెట్టాలి.
- ఎత్తైన నారుమడిపైనే నారును పెంచాలి..
- మంచు ప్రభావంతో నారుమడి చనిపోతుంది. కాబట్టి, నారుమడిచుట్టూ కొంత ఎత్తులో కట్టెలను కట్టి వాటిపై పాతబట్టలను కాని, పాలిథిన్ కవర్లను కాని కప్పాలి.
- సూక్ష్మ పోషకాల నివారణకు జింకు సల్ఫేట్ ఫార్ములా 4, 5లను పిచికారీ చేసుకోవాలి. పై జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుమడితో అధిక దిగుబడి పొందవచ్చు.

***జాగ్రత్తలు పాటించాలి..***

యాసంగిలో ముఖ్యంగా వరి నార్లు వేసుకునే రైతులు చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ముందుగా వ్యవసాయాధికారులను ఆశ్రయించి సరైన జాగ్రత్తలు పాటించాలి. మొలకెత్తే దశలోనే తెగుళ్లు సోకే అవకాశమున్నందున రైతులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి.



**- శంకర్‌లాల్, ఏవో, అయిజ**

# ఇక స్థానిక సంగ్రామం

- జనవరి 31తో ముగియనున్న పాలకవర్గం గడువు
- పంచాయతీ ఎన్నికలకు మొదలైన కసరత్తు
- నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ

| జిల్లా | గ్రామపంచాయతీలు |
|---|---|
| మహబూబ్‌నగర్ | 441 |
| నాగర్‌కర్నూల్ | 461 |
| వనపర్తి | 255 |
| జోగులాంబ గద్వాల | 255 |
| నారాయణపేట | 280 |
| మొత్తం | 1,692 |

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఇప్పుడిప్పుడే అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఆ సందడిని మరువకముందే పల్లెల్లోనూ ఎన్నికల సంబురానికి తెరలేచింది. జనవరి 31వ తేదీతో పంచాయతీ పాలక వర్గాల గడువు ముగియనుండడంతో ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టడంతోపాటుగా గ్రామస్థాయిలోనూ చేపట్టాల్సిన కార్యాచరణపై పంచాయతీ అధికారులకు, ఎన్నికలను పర్యవేక్షించే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గడువులోగా ఎన్నికలకు శ్రీకారం చుడితే మరోమారు పల్లెల్లో రాజకీయ వేడి రాజుకోనున్నది.

**ఇక పల్లెపోరు..**

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు కలెక్టర్లు, పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అశోక్‌కుమార్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. అవసరమైన ఏర్పాట్లను చేపట్టాల్సిందిగా ఈసీ ఆదేశించడం గమనార్హం. ఇంతకుముందు 2019 ఫిబ్రవరి 1నుంచి అమలులోకి వచ్చిన పంచాయతీ పాలకవర్గాల ఐదేండ్ల పదవీకాలం జనవరి నెలాఖరుతో ముగియనున్నది. దీంతో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారులు అవసరమైన కార్యాచరణను చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పోలింగ్ సిబ్బందిని సమకూర్చుకునేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని ప్రకారం ఓటర్ల వారీగా పోలింగ్ బూత్‌లు, సిబ్బంది నియామకాలకు సంబంధించి స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఈ క్రమంలో 200ఓటర్లు ఉన్న పంచాయతీకి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. అలాగే 400ఓటర్ల వరకు ఒక పీవో, ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రంలో ఒక పీవో, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించడం జరుగుతుంది. అలాగే అదనంగా 20శాతం మందిని ఎంపిక చేసి రిజర్వ్‌లో ఉంచనున్నారు. ఇక ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను Te-poll సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా ఎన్నికల సంఘం సూచించింది. కాగా, ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల వారీగా అమలులో ఉన్న రిజర్వేషన్ల వివరాలను ఎన్నికల సంఘం జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సేకరించింది. ఈ ఎన్నికలకు తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూర్పు చేసిన ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఈ జాబితాను గ్రామపంచాయతీ, వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. ఇలా తయారు చేసిన జాబితాలో అభ్యంతరాలు స్వీకరించి, ఓటర్ల తుది జాబితాను ప్రకటించడం చేపడతారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు దాదాపు నెల రోజుల సమయం పడుతుంది. అసెంబ్లీ ఎన్నికలు ఈవీఎంలతో నిర్వహించగా పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఒకే రోజు పోలింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించేలా ఈసీ నిర్ణయించుకుంటున్నట్లుగా తెలుస్తోంది. దీంతో బ్యాలెట్ పెట్టెలపై అతికించాల్సిన పేపర్ సీల్స్, అడ్రస్ ట్యాగ్స్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని ఈసీ ఆదేశించింది. కాగా ఈ ఎన్నికల నిర్వహణపై సందేహాలు కలుగుతున్నాయి. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్తగా ప్రభుత్వం ఏర్పడింది. దీనివల్ల గత ప్రభుత్వం 2019లో తీసుకొచ్చి అమలు చేసిన పంచాయతీ రిజర్వేషన్ల అమలు ఉంటుందా, లేదోననే అంశం తెరపైకి వస్తోంది. మొత్తం మీద పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుండటంతో గ్రామాల్లో మరోమారు రాజకీయ వేడి రగులనున్నది. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసిన స్థానిక నాయకులు ఈ ఎన్నికల్లో గ్రామాల్లో తమ పట్టును నిరూపించుకోనున్నారు.



ఉప్పునుంతల మండలం దేవదారికుంట గ్రామ పంచాయతీ కార్యాలయం

### మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలకు ఏర్పాట్లు..



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు జిల్లాలోని 461 పంచాయతీల రిజర్వేషన్ల వివరాలు పంపించాం. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ బూత్‌లు, సిబ్బంది నియామకం నెలాఖరులోగా పూర్తి చేస్తాం. గత 2019లో ఏర్పడిన పంచాయతీ పాలకవర్గాల గడువు జనవరి 31తో ముగియనున్నది. దీంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఈసీ చర్యలు తీసుకుంటున్నది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం, ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయంతో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి.

**-కృష్ణ, డీపీవో, నాగర్‌కర్నూల్**

